క్లుప్తంగా

కనులపండువగా కల్యాణం



రామచంద్రాపురం(పటాన్‌చెరు): పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని వెలిమెల గ్రామంలో శనివారం రాత్రి శ్రీలక్ష్మీఅనంత పద్మనాభ స్వామి కల్యాం కనులపండువగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం



శివకుమార్

పటాన్‌చెరుటౌన్: ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ వెంకట్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని గోకుల్‌నగర్ కాలనీకి చెందిన రుద్రారం శంకర్ కుమారుడు శివకుమార్ శుక్రవారం సాయంత్రం రోజు మాదిరిగానే ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు శివకుమార్ కోసం వెతికినా ఆచూకీ లభించలేదు. అతడి తండ్రి శంకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

సాగు, యంత్రాలపై అవగాహన



కూరగాయల నర్సరీ గురించి తెలుసుకుంటున్న ఉద్యాన విద్యార్థులు

జహీరాబాద్: కొండాలక్ష్మణ్ ఉద్యాన కళాశాల విద్యార్థినులు సాగు, ఆధునిక యంత్రాల పని తీరుపై అవగాహన పొందారు. శనివారం మండలంలోని రంజోల్ గ్రామంలో పర్యటించారు. ఫర్టిలైజర్ దుకాణాలు, నర్సరీలు, బయిలర్, తదితర యంత్రాలను పరిశీలించారు. రైతులు ఎక్కువగా ఎలాంటి మందులను వాడుతున్నారనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి ప్రదీప్, విద్యార్థులు, మహాలక్ష్మి, వర్ష, మానస, సంస్కృతి, స్వప్న, చందన, స్నేహ, సాత్విక పాల్గొన్నారు.

హనుమాన్ ఆలయాల్లో భక్తుల రద్దీ

నారాయణఖేడ్: ఖేడ్ మండలం కొండాపూర్‌లోని హనుమాన్ ఆలయం, దోపూరు లొంక హనుమాన్ ఆలయాల్లో శనివారం భక్తుల రద్దీ బాగా పెరిగింది. ప్రతీ శనివారం భక్తులు ఆయా ఆలయాలను పెద్దసంఖ్యలో సందర్శిస్తుండగా ప్రస్తుతం రెండో శనివారం సెలవు దినం కావడంతో భక్తుల రద్దీ పెరగడానికి కారణమైంది. భక్తులు బారులు తీరి హనుమాన్ ప్రతిమలను దర్శించుకున్నారు. ఆయా ఆలయాల ఆవరణల్లో భక్తుల సహకారంతో అన్నప్రసాద వితరణ చేపట్టారు.

పరీక్ష ప్యాడ్లు, పెన్నులు పంపిణీ

జహీరాబాద్: కోహీర్ మండలం పిచరాగడి ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఉచితంగా పరీక్షల సామగ్రి పంపిణీ చేశారు. శనివారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో సంగారెడ్డికి చెందిన విప్లవ రెడ్డి, డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, విద్యుత్ శాఖ అధికారి అంజయ్య పాల్గొని పాఠశాలలో టెన్త్ విద్యార్థులకు తమ వంతు సాయంగా పరీక్ష ప్యాడ్లు, పెన్నులు, సర్టిఫికెట్ ఫైల్స్ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉత్తమ చదువులు చదివి ఉన్నత శిఖరాలను అందుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో హెచ్.ఎం సురేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు

విశ్వపాలిని మందిరంలో చండీ యాగం

కల్హేర్(నారాయణఖేడ్): నిజాంపేట్ మండలం బల్కంచెల్క తండాలోని విశ్వపాలిని జ్వలముఖి భవానీ సమేత సేవలాల్ మహరాజ్ మహా మందిరంలో శనివారం అష్టాదశ చండీ యాగం ఘనంగా నిర్వహించారు. మందిరం ధర్మకర్త, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా రవాణ శాఖ డిప్యూటీ కమిషనర్ మూడ్ కిషన్ సింగ్‌-లలిత దంపతుల ఆధ్వర్యంలో యాగం చేపట్టారు. మహారాష్ట్రలోని లాతుర్‌కు చెందిన అంకుశ్ శర్మ, మందిరం పురోహితులు మనోజ్ శర్మ ఆధ్వర్యంలో వేదమంత్రాలు పఠించారు. హారతి, తీర్థప్రసాదం, అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో తండా ప్రముఖులు శంకర్, ఖత్రోత్ జైలిసింగ్, రూప్‌సింగ్, కిషన్ పాల్గొన్నారు.

మహిళా శక్తి చాటుదాం



జహీరాబాద్ టౌన్: మహిళలను సన్మానించిన నామ రవి కిరణ్ దంపతులు



సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మహిళా ఉద్యోగులను సన్మానిస్తున్న చింటూ గౌడ్



సదాశివపేట(సంగారెడ్డి): సదాశివపేటలోని శాంతినికేతన్ పాఠశాలలో..

జిల్లా కేంద్రంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, సంఘాలు, పార్టీల కార్యాలయాల్లో మహిళలను శనివారం ఘనంగా సన్మానించారు. వేడుకల్లో భాగంగా నిర్వహించిన పోటీల్లో రాణించిన మహిళలకు బహుమతులు అందించారు. ఆయా కార్యక్రమాల్లో పాల్గొన్న వక్తలు మాట్లాడుతూ మహిళలే నిదే మనుగడ లేదని కొనియాడారు.



రామచంద్రాపురం(పటాన్‌చెరు): కేక్ కట్ చేస్తున్న కార్పొరేటర్ సింధురెడ్డి



హత్నూర(సంగారెడ్డి): సికింద్లాపూర్‌లో మహిళలకు సన్మానం



సంగారెడ్డి: పాల్గొన్న గృహ కార్మికులు



జహీరాబాద్: క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ మహిళా నేతల వేడుకలు

వేడుకల నిర్వహణపై సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న కుమార్ యాదవ్

పటాన్‌చెరుటౌన్: ఉగాది పర్వదినాన్ని 30వ తేదీన నిర్వహించుకోవాలని పట్టణంలోని పుర ప్రముఖులు నిర్ణయించారు. పట్టణంలోని కోదండ సీతారామస్వామి దేవాలయంలో శనివారం నిర్వహించిన సమావేశానికి కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, ఎమ్మెల్యే సోదరుడు గూడెం మధుసూదన్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ సపాన్‌దేవ్, మాజీ ప్రజాప్రతినిధులు, పుర ప్రముఖులు హాజరయ్యారు. వేద పండితుల సూచనలకు అనుగుణంగా మార్చి 30న ఉగాది, ఏప్రిల్ 4 నుంచి 8వరకు శ్రీరామనవమి నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. పర్వదినాల సందర్భంగా అన్ని ఏర్పాట్లు చేయనున్నట్లు కార్పొరేటర్ తెలిపారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ జైపాల్, మాజీ కార్పొరేటర్లు శంకర్ యాదవ్, సపాన్‌దేవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సంత.. సమస్యల చింత

కంది వారాంతపు సంతలో వసతులు కరువు



రోడ్డుపైనే ఏర్పాటు చేసిన దుకాణాలు

కంది(సంగారెడ్డి): మండల కేంద్రమైన కందిలో నిర్వహించే వారాంతపు సంత సమస్యల చింతగా మారింది. కనీస వసతులు కరువైసంతకు వచ్చే వారు ఇబ్బందులు పడుతున్నారు. సంతను రోడ్లపైనిర్వహిస్తుండడంతో చౌరస్తాలో ట్రాఫిక్ జామ్ అవుతోంది. ప్రతీ శనివారం కందిలో జరిగే వారాంతపు సంతకు కందితోపాటు చుట్టు పక్కల గ్రామాల నుంచి వందలాది మంది వస్తుంటారు. సంతలో ఎలాంటి షెడ్లు లేకపోవడంతో వానకు వస్తువులన్నీ తడిసిపోతుండగా, ఎండాకాలంలో నీడలేక అవస్థలు పడుతున్నామని వాపోతున్నారు. అలాగే మరుగుదొడ్లు లేవు. ఓ వైపు చౌరస్తా మరో వైపు బెంగుళూరు బైపాస్ రోడ్డు ఉండటంతో తరచూ ట్రాఫిక్ జామ్ అయ్యి వాహనాలు నిలిచి పోయి రాకపోకలకు ఆటంకం ఏర్పడుతోంది. సంతతో వచ్చే ఆదాయంతో మరుగుదొడ్లు ఏర్పాటు చేయడంతోపాటు ఒకే చోట దుకాణాలు ఏర్పాటు చేసేలా చూడాలని కోరుతున్నారు.

లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కారం



జహీరాబాద్ : లోక్ అదాలత్‌లో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి సూరికృష్ణ

జహీరాబాద్: జాతీయ లోక్‌అదాలత్‌లో భాగంగా సీనియర్ కోర్టు విభాగంలో 103 కేసులు, జూనియర్ కోర్టుల విభాగంలో 219 కేసులు పరిష్కారమైనట్లు మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి సూరికృష్ణ తెలిపారు. కేసుల పరిష్కారంతో పాటు మొత్తం రూ.86,40,835 వసూలు అయ్యాయన్నారు.

782 కేసులు పరిష్కారం

నారాయణఖేడ్: నారాయణఖేడ్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో శనివారం జాతీయ మెగా లోక్ అదాలత్ నిర్వహించారు. రాజీ అయ్యే అవకాశం ఉన్న కేసుల్లో ఇరు వర్గాల పరస్పర అంగీకారంతో న్యాయమూర్తి మంథని శ్రీధర్ 782 కేసులను పరిష్కరించినట్లు తెలిపారు.

స్పెషల్ క్యాజువల్ సెలవు ఇవ్వరా?



మాట్లాడుతున్న ఉపాధ్యాయ నాయకులు

చేగుంట(తూప్రాన్): అంతర్జాతీయ మహిళ దినోత్సవం రోజైనా గురుకుల మహిళ ఉపాధ్యాయులకు స్పెషల్ క్యాజువల్ సెలవు ఇవ్వరా అని తపస్ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎల్లం, లక్ష్మణ్ డిమాండ్ చేశబూరు. చేగుంటలో శనివారం మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళ దినోత్సవం రోజు సైతం గురుకుల మహిళ ఉద్యోగులను కచ్చితంగా విధులు నిర్వహించాలని ఉన్నతాధికారులు ఆదేశించడం సమంజసం కాదన్నారు. గురుకులాల సమయ పాలనను మార్పు చేయాలని, రాత్రి సమయాల్లో మహిళ ఉపాధ్యాయులకు నైట్‌కేర్ టేకర్ విధుల నుంచి మినహాయింపు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా నాయకులు మాధవరెడ్డి, శ్రీధర్‌రెడ్డి, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

'చలో ఢిల్లీ'ని విజయవంతం చేయాలి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న జగన్ తదితరులు

చేగుంట(తూప్రాన్): భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని యూఎస్‌ఎఫ్‌ఐ విద్యార్థి జిల్లా అధ్యక్షుడు జగన్ అన్నారు. బీసీ బాలుర వసతి గృహం వద్ద శనివారం చలో ఢిల్లీ కార్యక్రమం కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ నూతన విద్యా విధానంతో ఇతర రాష్ట్రాల్లో ప్రభుత్వ బడులు మూత పడుతున్నాయని ఆరోపించారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 18 మందికి జరిమానా

పటాన్‌చెరుటౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు కోర్టు జరిమానా విధించిందని ట్రాఫిక్ సీఐ లాలూ నాయక్ తెలిపారు. శుక్రవారం నిర్వహించిన వాహన తనిఖీలో 18 మందిని పట్టుకొన్నామని, వారిని శనివారం కోర్టులో హాజరుపర్చగా ఒక్కొక్కరికి రూ.వెయ్యి చొప్పున జరిమానా విధించినట్లు తెలిపారు.

విగ్రహ పున:ప్రతిష్ఠాపన

సంగారెడ్డి: సంగారెడ్డి పట్టణంలోని తొమ్మిదవ వార్డు కల్వకుంటలో దుర్గాదేవి ఆలయంలో విగ్రహ పున:ప్రతిష్ఠాపన మహోత్సవ కార్యక్రమాలు శనివారం వైభవంగా జరిగాయి. దుర్గాదేవి ప్రత్యేక పూజలు, తదితర కార్యక్రమాలను పండితులు వేదమంత్రాలతో కన్నుల పండువగా నిర్వహించారు. వేడుకల్లో మహిళల డ్రెస్ అందరినీ ఆకట్టుకుంది. నేటి ఉత్సవాలు ముగియనున్నాయి.

ఆరాధన మహోత్సవాలు

హత్నూర(సంగారెడ్డి): మండలంలో గల సిరిపుర గ్రామ శివారులోని సద్గురు రూపర హిత వీర ధర్మజా మాత మాణికేశ్వరి ఆశ్రమంలో వీరమ్మ మాతాజీ ఆరాధన మహోత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. రెండు రోజులపాటు జరిగే ఈ ఆరాధన ఉత్సవంలో భాగంగా మొదటి రోజు గోమాత పూజ గణపతి పూజ అఖండ దీపారాధన ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. ఆదివారం సద్గురు మాతా మనికేశ్వరి అమ్మవారి పాదుకపూజ సంపూర్ణ భగవద్గీత పారాయణం లక్ష్మీ గణపతి హోమం నిర్వహించడం జరుగుతుందని ఆలయ పీఠాధిపతి దేవదాస్ స్వామి తెలిపారు.

నోట్‌బుక్స్, బ్యాగుల పంపిణీ

వట్‌పల్లి(అందోల్): మండల పరిధిలోని కేరూర్ గ్రామంలో ఇటీవల తల్లిని కోల్పోయి అనాథలుగా మారిన ఇద్దరు చిన్నారులు భాగ్య, భార్గవిలకు శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా రిటైర్డ్ ఉపాధ్యాయుల సంఘం ఆధ్వర్యంలో నోట్ బుక్స్, బ్యాగులను అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్, కార్యదర్శి మనోహర్ ప్రసాద్, శంకరప్ప, గోపాల్, వీరేశం, పాండురంగం, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా స్వయంపాలన

రాయికోడ్(అందోల్): మండలంలోని శ్రీ వివేకానంద హై స్కూల్‌లో శనివారం విద్యార్థులు స్వయం పాలన దినోత్సవాన్ని ఉత్సాహంగా జరుపుకొన్నారు. పాఠశాల కరస్పాండెంట్ విఠల్ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి కింది స్థాయి తరగతులకు పాఠాలు బోధించారు. ప్రిన్సిపాల్ లీనా, ఉపాధ్యాయులు స్వయం పాలనను పర్యవేక్షించారు. స్వయం పాలనతో పిల్లలు నాయకత్వ లక్షణాలు పెంపొందించుకుంటారని కరస్పాండెంట్ అభిప్రాయపడ్డారు.

ఆలయ మహిళా ఉద్యోగులకు సన్మానం

ఝరాసంగం(జహీరాబాద్): మహిళా దినోత్సవ సందర్భంగా ఆలయంలో విధులు నిర్వహిస్తున్న మహిళా ఉద్యోగులను సన్మానించారు. శనివారం ఆలయ కార్య నిర్వహణ అధికారి శివ రుద్రప్ప ఆధ్వర్యంలో మహిళలకు శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో లింగ బలిజ సంఘం జిల్లా అధ్యక్షులు పృథ్వీరాజ్, తదితరులు పాల్గొన్నారు.

అత్యాచార నిందితుడిని కఠినంగా శిక్షించాలి



నిరసన వ్యక్తం చేస్తున్న సీఐటీయూ నాయకులు

సంగారెడ్డి ఎడ్యుకేషన్ : జగిత్యాల జిల్లాలో దళిత ఆశా కార్యకర్తపై అత్యాచారం చేసిన నిందుతుడిని కఠినంగా శిక్షించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆశా కార్యకర్తపై జరిగిన అత్యాచారాన్ని ఖండిస్తూ శనివారం సీఐటీయూ ఆధ్వర్యంలో సంగారెడ్డిలోని న్యూ బస్టాండ్ వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా జీ.సాయిలు మాట్లాడుతూ.. జగిత్యాలలో జరిగిన ఈ ఘటన అత్యంత సిగ్గుచేటన్నారు. ఈ నేరానికి పాల్పడిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మంగ, శశికళ, ఏసుమని, గౌరమ్మ, పాల్గొన్నారు.

రథయాత్ర.. ఆధ్యాత్మిక శోభ



దత్తగిరి మహారాజ్‌కు సన్మానం చేస్తున్న భక్తులు

సంగారెడ్డి : సంగారెడ్డి పట్టణంలో శనివారం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. జిల్లా పరిధిలోని బర్దీపూర్ దత్తపీఠం పీఠాధిపతులు శ్రీ దత్తగిరి మహారాజ్ సిద్ధేశ్వరానందగిరి మారాజుల రథ యాత్ర నిర్వహించారు. సంగారెడ్డిలోని దత్తగిరి ఆశ్రమం నుంచి కంది మండల పరిసరాల్లో గల ఎస్ఎస్ ఫంక్షన్ హాల్ వరకు ఈ రథయాత్ర కొనసాగింది. ఈ సందర్భంగా అప్పగారు మాట్లాడుతూ.. ఆధ్యాత్మికతను ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని, అందరూ ఐక్యంగా ఉండి సనాతన ధర్మాన్ని కాపాడాలని కోరారు. 41 రోజులపాటు త్రివేణి సంఘంలో 66 కోట్ల మంది భక్తుల పుణ్యస్నానాలు చేశారని గుర్తు చేశారు. అక్కడికి చేరుకున్న భక్తులకు ఉండేందుకు స్థానంతోపాటు భోజన ఏర్పాట్లను కూడా దత్తగిరి ఆశ్రమం తరఫున ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అనంతరం భక్తులందరికీ త్రివేణి సంగమం నుంచి తెచ్చిన తీర్థ ప్రసాదాన్ని అందించారు. సమావేశంలో పట్టణ అధ్యక్షుడు మడుపతి వీరేశం, ప్రధాన కార్యదర్శి శివకుమార్, గంగాధర్, మడుపతి మహేశ్వర్, విశ్వ ప్రసాద్, సోమనాథ్, శివప్రసాద్, చంద్రశేఖర్, విజయభాస్కర్, బసవేశ్వర్, సురేశ్, ప్రభాకర్, వైద్యనాథ్, మఠం భిక్షపతి, అల్లాడి వీరేశం, తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో విగ్రహం ధ్వంసం

నిందితుడి అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలింపు



వివరాలువెల్లడిస్తున్న డీఎస్పీ సత్తయ్య గౌడ్

సంగారెడ్డి క్రైమ్: దేవత విగ్రహాన్ని ధ్వంసం చేసిన నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. సంగారెడ్డి డీఎస్పీ సత్తయ్య గౌడ్ కథనం మేరకు.. సంగారెడ్డి పట్టణంలోని రాజంపేటకు చెందిన సంగీతం బుచ్చప్ప(52) చందానగర్‌లోని మంజీరా వాటర్ వర్క్స్ కాంట్రాక్టుగా పని చేస్తున్నాడు. ఇతడికి భార్య సుమలత, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. రెండు నెలల కిందట భార్య చనిపోయింది. అప్పటినుంచి బుచ్చప్ప మద్యానికి బానిసై తీవ్రమైన మనస్తాపానికి గురవుతున్నాడు. గత నెల 24న స్నేహితుడు ఇసాక్‌తో కలిసి మహబూబ్‌సాగర్ చెరువు కట్టపై మద్యం తాగారు. ఇద్దరి మధ్య మనస్పర్థలు రావడంతో ఇసాక్ అక్కడి నుంచి వెళ్లిపోయాడు. అప్పటికే మద్యంమత్తులో ఉన్న బుచ్చప్ప జీవితంలో దేవుడు తనకేమీ చేయలేదని కోపంతో పక్కనే ఉన్న బండరాయిని తీసుకొని గర్భగుడిలోని అమ్మవారి విగ్రహాన్ని ధ్వంసం చేశాడు. శనివారం పోలీసులు నిందుతుడిని అదుపులోకి తీసుకొని విచారించగా నేరాన్ని అంగీకరించాడు. ఈ మేరకు కేసు నమోదు చేసిన రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ వివరించారు. సమావేశంలో పట్టణ సీఐ రమేశ్, ఎస్‌ఐ కిషోర్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

బూచినెల్లి రోడ్డును బాగుచేయండి



బూచినెల్లి రోడ్డును పరిశీలిస్తున్న సీఐటీయూ నాయకులు

జహీరాబాద్ టౌన్: అధ్వానంగా తయారైన బూచినెల్లి రోడ్డును శనివారం సీఐటీయూ నాయకులు పరిశీలించారు. బూచినెల్లి ప్రాంతంలో ఉన్న పారిశ్రామిక వాడలో రోడ్లు ధ్వంసం అయ్యాయని, రాకపోకలకు ఇబ్బందిగా మారిందని, సీఐటీయూ పారిశ్రామిక క్లస్టర్ కన్వీనర్ ఎస్.మహిపాల్ వాపోయారు. కార్మికులు నైట్ షిఫ్ట్ వెళ్లడానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విచారం వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డును మరమ్మతులు చేయాలని కోరారు. ఆయన వెంట నాయకులు సందీప్ రెడ్డి, మధుకర్,దేవిదాస్ తదితరులు ఉన్నారు.

ఘనంగా మహిళా దినోత్సవం

సివిల్ కోర్టులో కేక్ కట్ చేసిన సివిల్ జడ్జి



జోగిపేట పోలీస్‌స్టేషన్‌లో మహిళ సిబ్బందిని సన్మానిస్తున్న అధికారులు, నాయకులు

జోగిపేట(అందోల్): జోగిపేటలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా వివిధ రంగాల్లో సేవలను అందిస్తున్న మహిళ అధికారులు, సిబ్బందిని శనివారం సత్కరించారు. స్థానిక విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ప్రభుత్వ డాక్టర్లు, పోలీసుశాఖలో పనిచేస్తున్న మహిళా సిబ్బందిని శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ పాండు, అందోలు మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.ప్రేమ్‌కుమార్, ఎం.మనోహర్ ప్రసాద్‌లు పాల్గొన్నారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో డివిజన్ కార్యదర్శి విద్యాసాగర్ ఆధ్వర్యంలో మహిళలను ఘనంగా సన్మానించారు. జోగిపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మహిళ ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పీఆర్‌టీయూ అధ్యక్షుడు ఎ.మాణయ్య, మంజ్యానాయక్, రాములు, అనిల్ కుమార్, త్రినాథ్,నరోత్తమ్ కుమార్, స్థానిక మున్సిపాలిటీలో మహిళా ఉద్యోగులను కమిషనర్ తిరుపతి ఆధ్వర్యంలో సన్మానించారు. జోగిపేట కోర్టులో జడ్జి ధనలక్ష్మి, మహిళ ఉద్యోగులను న్యాయవాదులు ఘనంగా సన్మానించారు. జోగిపేట ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో సూపరింటెండెంట్ డాక్టర్ సౌజన్య ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించారు.

• సర్వైకల్ క్యాన్సర్‌పై అవగాహన



క్యాన్సర్ అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న డాక్టర్లు

సర్వైకల్ క్యాన్సర్ నివారణ, ఎచ్‌పీవీ వ్యాక్సిన్ డ్రైవ్ గురించి అవగాహన పెంపొందించేందుకు ఐఎంఏ సంగారెడ్డి, డాక్టర్స్ క్లబ్ సంయుక్తంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా వాక్థాన్ శనివారం నిర్వహించారు. ఐబీ గెస్ట్ హౌస్ నుంచి కలెక్టరేట్ వరకు 100 మంది వైద్యులతో ప్రధాన అతిథిగా టీజీసీ నిర్మల రెడ్డి హాజరై ఉత్సాహంగా పాల్గొన్నారు . ఈ మహిళల ఆరోగ్య పరిరక్షణలో ముందు జాగ్రత్తలు తీసుకోవడం ఎంత ముఖ్యమో వివరించారు. ఐఎంఏ సంగారెడ్డి అధ్యక్షుడు కిరణ్ కుమార్ మాట్లాడుతూ.. సర్వైకల్ క్యాన్సర్ నుంచి రక్షణ పొందేందుకు తదుపరి జాగ్రత్తలు, స్క్రీనింగ్, వ్యాక్సినేషన్ కీలకమైనవని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆనంద్, రాజు గౌడ్, సురేశ్, పరశురామ్, వెంకట్, తదితరులు పాల్గొన్నారు.

– సంగారెడ్డి :